

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 జూన్, 2015 సంచిక : 1

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

వార్షిక చందా .......... రూ॥ 80/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2

గజానన విజయం ........ 5

సత్యవ్రతుని కథ ........ 7

ఆశీరక్షతలు ........ 10

ఎల్లాం సామి అనుగ్రహం దా ...... 11

నాడూ అంతే-నేడూ అంతే ........ 14

అనుభవాలు-అనుభూతులూనూ 16

శుకవాణి ........ 21

మాతృసంస్థ కబుర్లు ........ 22

శ్రీ కోదండ రామసాయి సన్నిధానంలో.. 26

సాయినాథ క్షేత్రంలో ఏం ........ 27

స్వరాంజలి ........ 30

షిరిడీ డైరీ ........ 31







# మా వాణి



## అష్టసిద్ధులు

సాధకులు ఏకాగ్రచిత్తంలో తీవ్రసాధనలు చేసే తరుణంలో కొన్ని సామాన్యమానవాతీతాలైన శక్తులు వాటంతట అవే మానవునిలో వికసిస్తుంటాయి. అవి బయటినుంచీ రావు. మనలో అంతర్గతంగా ఉండి, అనేకానేక కారణాల చేత నిద్రాణమై ఉన్న ఆయా శక్తులు-మనలో ఏర్పడుతున్న శారీరిక, మానసిక నైర్మల్యాల వలన, ఏకాగ్రత వలన ప్రజ్వలంగా వికసిస్తాయి. వీటినే అష్టసిద్ధులంటారు. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం అనే అష్టసిద్ధులు సాధకుని స్థాయినిబట్టి సంప్రాప్తిస్తూ ఉంటాయి. ఈ సిద్ధుల కోసమే జపతపాదులు చేసేవారు ఉత్తమ సాధకులు కానేరరు. భగవత్ప్రాప్తి కొరకై తీవ్ర సాధన చేస్తున్నప్పుడు ఇవి ప్రాప్తిస్తే సాధకునికి కొంతమేలే. కానీ, అవే తన లక్ష్యంగా చేసుకొని సాధన చేసే వారు క్షుద్రమార్గాలవైపు జారిపోయే ప్రమాదం చాలా ఎక్కువ. ఈ సిద్ధుల కన్నా చాలా దిగువమెట్టున క్షుద్ర శక్తులు కొన్ని ఉంటాయి. కొందరు వాటిని చూపించి సామాన్య జనులను మోసగించే సందర్భాలు కూడా ఉంటాయి. శ్రీ రామకృష్ణ పరమహంస, భగవాన్ శ్రీ రమణమహర్షి, కంచి పరమాచార్యులు యీ కాలంలో మన ముందు కనిపించిన సిద్ధపురుషులు కాగా-అనాదికాలంగా అనేకమంది ఋషులు, హనుమదాది ఐతిహాసిక పురుషులు కూడా యీ సిద్ధులు పొందినవారున్నారు. ఐతే వారెవ్వరూ ఆయా సిద్ధులను తమ స్వార్థానికో-మహత్త్వ ప్రదర్శనకో ఉపయోగించిన ఋజువులు లేవు-ఎవరినైనా రక్షించడానికో, వారిలో విశ్వాసం, మనోబలం పెంచడానికో తప్ప. వారు వాటిని

లెక్కచేయనూ లేదు. అవి తమక ఉన్నవన్న స్పృహ కూడా ఉన్నట్లు కన్పించే వారు కారు.

ఒకసారి హృదయుని ప్రోద్బలం మీద శ్రీ రామకృష్ణ పరమహంస కాళీమాతను ప్రార్థించాడు అష్టసిద్ధులిమ్మని. వెంటనే ఆయనకొక దృశ్యం కన్పించింది-ఒక వృద్ధ స్త్రీ మలవిసర్జన చేస్తున్నట్లు. దానితో ఆయనకు అర్థమైంది ఆ సిద్ధులన్నవి అంత హీనమైనవనీ, వాటి కోసం ప్రాకులాడ కూడదనీను. ఒకసారి ఒక సాధకుడు వచ్చి నలభై ఏళ్ళు సాధన చేసి నీళ్ల మీద నడవడం నేర్చుకొన్నానని చెప్తే రామకృష్ణుడు "అయ్యయ్యో, కానీ యిస్తే పడవ వాడు తీసుకువెళ్లే దానికి నలభై ఏళ్ల జీవితం వ్యర్థం చేసుకున్నావా!" అన్నారు మందలింపుగా.

అష్టసిద్ధులు ఉన్నప్పటికీ కొందరు వాటిని ప్రదర్శించరు-ఎప్పుడో ఒక్కొక్కసారి ప్రసంగవశాత్తు వెల్లడి చేస్తుంటారంతే. శారదామాత నిజానికి వస్వావాక్కే అనుకోవచ్చు. ఆమె మరదలు సురబాల, సురబాల కుమార్తె రాధు. శారదాదేవిని గూర్చి తేలికగా నిందాపూర్వకంగా మాట్లాడితే "నేను ఒక్క మాటంటే నువ్వు ఏమౌతావో తెలుసునా? ఇంక ఆపు" అని తీవ్రంగా మందలించారు తప్ప వాళ్లనేమీ చెయ్యలేదు.

రామాయణంలో హనుమంతుడు సిద్ధులను కైవసం చేసుకున్న మహనీయుడు. అణువంతగా మారి సురస నోటిలోకి దూరి బయటకు రావటం, సీతాదేవి ముందు ఆమె సందేహం తీర్చడానికి "చుక్కలు తల పువ్వులుగా అక్కజముగ మేను పెంచి" తన మహిమ ప్రదర్శించడం, తమ లఘిమా శక్తితో సముద్రాన్ని దాటి వెళ్లగలగడం మొదలైన అనేక సందర్భాలతో ఆయన శక్తులు ప్రదర్శితమవుతాయి. గొప్ప శారీరక శక్తి, సిద్ధులు, వీరత్వం అన్నీ ఉండి కూడా హనుమ రామచంద్రుని ముందు దాసుడైపోవడమే ఆయనను దాదాపుగా రాముడంతటివాడిని చేసింది. సిద్ధులు పొందిన వాడికి ఆ వినీతత్వం ఎంతో అవసరమని హనుమ వృత్తాంతం మనకు చెబుతుంది.





శ్రీ సాయి చరిత్రలో ఖండయోగం గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఆయన స్వయం పరమాత్ముడే కనక ఇవన్నీ ఆయనకి వశ్యాలే. భూత, భవిష్యత్, వర్తమానాలు గ్రహించగలిగిన మహానుభావులు కంచి పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వాముల వారు అనేకసార్లు తమ శక్తితో ఎందరికో మేలు చేసారు. కానీ, అవే సిద్ధులలో ఒకటో, రెండో సాధించి, వాటికి క్షుద్రశక్తులను జోడించి అమాయక ప్రజలను, నిర్మల చిత్తంతో చేరవచ్చే భక్తులను మోసగించే ప్రబుద్ధులు ఎందరెందరో తయారైనారు. ఇప్పుడే కాదు-

కువలయాశ్వుడనే రాజును మోసగించడానికి తాళధ్వజుడనే రాక్షసుడు మౌని వేషం ధరించి ఒక ఆశ్రమాన్ని సృష్టించుకొని, అందులో కూర్చున్నాడు. సహజంగా సాధు సన్యాసులంటే అభిమానం ఉన్న కువలయాశ్వుడు ఆశ్రమంలోకి వెళ్లగానే ఆ చెట్ల పూలన్నీ రాజుగారి పేరు ఆకారంలో రాలి స్వాగతించాయి. తాళధ్వజుడు రాజును పేరు పెట్టి పిలిచి పలకరించాడు. ఆయన శక్తులను చూచి ముగ్ధుడైన కువలయాశ్వుడు అతనిని మనసారా విశ్వసించి ఆయన చెప్పినట్లు చేసి మోసపోయి భార్యను కూడా పోగొట్టుకున్నాడు. ఈ కథ దత్తాత్రేయ చరిత్రలో కనిపిస్తుంది. ఇలాంటి మాయగాళ్ల సంఖ్య యిటీవలికాలంలో అనంతంగా పెరిగిపోయింది. క్షణంలో శక్తిపాతం చేస్తామనేవారు, రెండు క్షణాల్లో ఆత్మసాక్షాత్కారం కలిగిస్తాననేవారూ, ఒక్క పూటలో కుండలిలిని నిద్రలేపుతామనేవారూ కూడా భక్తులివ్వగలిగే దక్షిణల రేట్లనుబట్టి తయారైపోతున్నారు. అమాయకభక్తులు-ముఖ్యంగా సాయి భక్తులు ఇలాంటి వారి బారినపడకుండా జాగ్రత్తపడాలి. బాబా పేరు చెప్పగానే - అందునా గురువారం ఇలాంటివారెవరైనా ఎదురుకాగానే విశ్వసించటం వారికి అలవాటు. కనుక తేలికగా మోసపోయే అవకాశం ఉంది. సాధకులైన భక్తులు కూడా ఇటువంటి సిద్ధులు కావాలని తపించకుండా పరమాత్మ ప్రాప్తికై తపించడం సర్వోత్తమం.

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 10వ అధ్యాయము

ఒకసారి మహారాజుల వారు అమరావతికి (మహారాష్ట్ర) వెళ్ళారు. అక్కడ జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ అధికారి ఆత్మారాం భికాజీ అనే భక్తుని ఇంట్లో బసచేశారు.

ఆ భక్తుడు స్వామివారిని ఎంతో భక్తితో స్వాగతించి అభిషేకాదులు ఆచరించాడు. స్వామి వారికి పాదపూజ గావించి పెద్ద ఎర్రని అంచు గల ఒక ధోవతిని సమర్పించాడు. అటుపై మహారాజులవారి నుదుటి మీద తిరుచూర్ణముతో రంగరించిన గంధపు పూతలు అద్దాడు.

ఆ ఊరి ప్రజలలో చాలామంది వారి దర్శనానికి వచ్చి అర్చనలో పాల్గొనటమేకాక, తమతమ గృహాలకు భిక్షకు రావలసినదిగా ప్రార్థించారు. ఆ విధంగా మహాత్ముల్ని సేవిస్తే ఆ భగవంతుని సేవించినట్లేనని శాస్త్రం ఉన్నది గదా! అయితే అందరి ఆశలూ ఎలా తీరుతై? ధన్యాత్ములూ పవిత్రులూనైన వారి ప్రార్థనలకే మహాత్ములు లొంగుతారు. అలాంటివారే స్వామీజీని తమ నివాసాలకు తీసుకొని పోగలగుతారు.

గణేష్ శ్రీకృష్ణకపర్దే అనే ప్రఖ్యాత న్యాయవాది లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారి సహచరుడు (వీరే శ్రీ సాయి సన్నిధిలో నాలుగు నెలలు ఉండి 'షిరిడీ దినచర్య' వ్రాసిన భక్తుడు) శ్రీ గజానన మహారాజుల వారిని తమ గృహానికి భిక్ష స్వీకరించటానికి స్వాగతించాడు. ఈ కపర్దే మంచి భక్తుడేగాక అప్పట్లో గొప్ప ధనికుడు కూడ. కపర్దే స్వామికి ఎంతో భక్తితో, సాక్షాత్తు భగవంతుని మూర్తికి చేసినట్లుగా పూజాదికాలు నిర్వహించాడు.

ఆ ఊళ్ళోనే గణేశ్ అప్పా అనే శివభక్తుడున్నాడు. అతడు లింగాయత్. అతని భార్య చంద్రబాయి చాలా సౌమ్యురాలు. మహారాజుల వారిని తమ యింటికి కూడ భిక్షకు పిలిచి సేవించుకోవాలని ఆమెకు కోరిక కలిగింది. అలా స్వామిని ప్రార్థించమని భర్తను కోరింది. తాను ప్రభుత్వ అధికారంలో లేననీ, కపర్దే అంతటి ధనికుడిని కాననీ అందువల్ల స్వామి ఆర్థిక స్థితి సరిగాలేని తమవంటి వారి ప్రార్థన మన్నిస్తారనే నమ్మకం లేదనీ అతడు ఆ విషయంలో జంకుతున్నాడు. కాని అతని భార్య మాత్రం పట్టుబట్టింది. "మనకు అంతటి సంపద లేకపోవచ్చుగాని, భక్తి ప్రపత్తులలోను, ధార్మిక ప్రవర్తనలోను ఎక్కడా లోపం లేదు కదా! మీరు ప్రార్థించి చూడండి. స్వామి అంగీకరించాలనే నేను మనసారా ప్రార్థిస్తున్నాను" అని ప్రాధేయపడింది ఆ ఇల్లాలు.

గణేశ్ అప్పా స్వామి సన్నిధిలో యితర భక్తులతోపాటు కూర్చున్నాడు గాని, స్వామిని అడిగే ధైర్యం చేయలేకపోతున్నాడు. హఠాత్తుగా స్వామి అతని వంక చూచి "నీ ఇల్లు ఇక్కడికి ఎంత దూరం?" అని ప్రశ్నించాడు. అతడీ సంఘటనకు ఆనందం పట్టలేకపోయాడు. తన మనసులోని కోరికను స్వామి స్వయంగా గ్రహించి అనుగ్రహించినట్లు తెలుసుకొని ఎంతో భక్తిపూర్వకంగా తమ యింటికి తోడ్కొనిపోయాడు. అక్కడ భార్యాభర్తలిరువురు ఎంతో భక్తితో మహారాజును సేవించి తమ గృహం పావనమైందని సంతోషించారు. మహాత్ముల దృష్టిలో బీద, ధనిక తేడాలు ఉండవు. వారు మన్నించేది హృదయపూర్వకమైన భక్తిని మాత్రమే.

(ఇంకా ఉంది)



---



## అహంకారం

ఆత్మవిశ్వాసం అవధులు దాటితే అహంకారంగా పరిణమిస్తుంది. 'నాకూ తెలుసు', 'నేనూ చెయ్యగలను' అనుకుంటే ఆత్మవిశ్వాసం 'నాకే తెలుసు', 'నేనే చెయ్యగలను' అనుకుంటే అహంకారం. ఈ అహంకారం అనేకులను మానసికంగా మనకు దూరం చేస్తుంది. ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో యిది భయంకరమైన అడ్డుగోడగా నిలుస్తుంది. అందుకే శ్రీ సాయిబాబా వారు "నీ అహంకారాన్ని తీసి నా పాదాల దగ్గర పెట్టమ"న్నారు.

# సత్యవ్రతుని కథ

- శ్రీమద్భాగవతం నుండీ

పూర్వం సత్యవ్రతుడు అనే ఒక ప్రభువు ధర్మపరుడై ప్రజారంజకంగా పరిపాలన సాగిస్తుండేవాడు. ఓసారి ఆయన నదీతీరంలో నిలిచి నిష్ఠాపరుడై కేవలం జలంతో జీవిస్తూ తపస్సు ఆచరింపసాగాడు. అలాంటి సమయంలో ఒకరోజు ఆయన కృతమాలిక అనే పేరు గల ఏటిలో నిలచి, హరిప్రీత్యర్థం జలతర్పణం చేయదలచి, దోసిటి నిండా నీరు తీసుకున్నాడు. ఆ నీటిలో ఒక చేపపిల్ల ఉంది. గభాల్న అతడు ఆ చేపపిల్లను నదిలో విడిచాడు. అప్పడా మీనం యిలా అంది 'మహారాజా క్రూరులైన బంధువులు కొందరు పిల్ల చేపలన్నిటినీ చంపుతుంటే భయపడి నీ దోసిటి లోకి వచ్చాను. నన్ను తిరిగినట్టేట వదిలావు. జాలరులు వచ్చి బంధిస్తారు. నీవు దయతో నన్ను రక్షించు".

ఆ మత్స్యం వేడికోలు విని రాజు దానిని తన కమండలంలో ఉంచి ఇంటికి తీసుకెళ్లాడు. మరునాటికి అది కమండలంలో పట్టనంతగా పెరిగి పోయింది. తనకు చోటు చాలడం లేదని రాజుతో మొరపెట్టుకున్నది. ఆయన దాన్ని పెద్ద పాత్రలో విడిచిపెట్టాడు. అది క్షణకాలంలో మూడు చేతుల పొడవై ఆ పాత్రలో పట్టకుండాపోయింది. కరుణామయుడైన సత్యవ్రతుడు దానినొక చిన్న మడుగులోనికి మార్చాడు. అది మడుగంతా నిండి కదలడానికి చోటులేదన్నది. రాజు దాన్ని పెద్ద సరస్సులో విడిచి పెట్టాడు. ఈ విచిత్రమత్స్యం జలాశయం అంతా పెరిగింది. పెరగడానికి చోటు లేదని మొత్తుకుంది. సత్యవ్రతుడు దానిని మహాసాగరంలో విడిచి పెట్టాడు. వెంటనే మీనం "నన్ను మొసళ్లు మింగుతాయి. ఇన్నాళ్లు రక్షించి యిప్పుడు విడిచిపెడతావా? ఇక్కడ నుండి నన్ను బయటికి తీసి రక్షించ మన్నది".





అందుకా సత్యవ్రతుడు-ఓయీ ఋషోత్తమా! ఒక్క రోజులో నూరు యోజనాలు విస్తరించగల నీవు మామూలు చేపవు కావు. కరుణతో వచ్చిన శ్రీమన్నారాయణుడవే. మేము నీ పాదాల యెడ భక్తిశ్రద్ధలు కలవారమే. నీ భక్తులకు ఎట్టి నాశనమూ ఉండదు. నీవీరీతిన మీనమైన కారణ మేమిటో తెలియజెప్ప. స్వామీ! అని ప్రార్థించాడు. అందుకా ఋషం "నేటి నుండీ ఏడవ రోజున ముల్లోకాలూ ప్రళయ సాగరంలో మునిగిపోతాయి. ఈ లోపల ఒక పెద్ద నావ నిన్ను చేరవస్తుంది. దానిపైన అన్నిరకాలైన విత్తనాలు ఔషధాలు నింపుకొని నీవు కూడా అందులో ఎక్కు. సప్త ఋషులు కూడా నీతో కలిసి వస్తారు. ఆ కారుచీకటిలో మునుల శరీర తేజస్సు వెలుగులో యీ నావ నడుస్తూ ఉంటుంది. ఆ నావ అలల్లో మునగ కుండా, జల జంతువుల పాలపడకుండా, సుడులలో తిరగబడకుండా నేను నా కొమ్ము చివరతో రక్షిస్తుంటాను. అలా ఒక బ్రహ్మరాత్రి. అనగా ఏడు రోజులపాటు రక్షిస్తాను. అందుకొరకే యీ మీనావతారం ధరించాను" అని అన్నది. అటుపైన అది సత్యవ్రతుని ఆశీర్వదించి మాయమైపోయినది.

సత్యవ్రతుడు శ్రీహరి పలుకులు తలుచుకుంటూ, దర్భశయ్య పరుచు కొని తూర్పుకు తలఉంచి దీక్షతో ధ్యానించసాగాడు. కల్పాంతం వచ్చింది. ఏళ్ళూ, పూళ్లూ ఏకమయ్యే వాన కురిసింది. సాగరాలన్నీ చెలియలి కట్టలు దాటి భూమిని ముంచివేసినాయి. సర్వజీవరాసులు నశించిపోయినాయి. ఆ పెనుచీకటిలో బ్రహ్మ సృష్టి చేస్తూ అలసి నిద్రించాడు. ఆయన పెట్టిన గురకల నుండి తొలినుడులు అనగా వేదాలు వెలికి వచ్చినాయి. వానిని హయగ్రీవుడు అనే రాక్షసుడు దొంగిలించి సముద్రంలో దూరినాడు. విష్ణువు ఆ జలరాశిలో మీనావతారంలో దూరి అల్లకల్లోలం చేసినాడు.

అంతకన్నా ముందరే సత్యవ్రతుడు నారాయణ ప్రేరితమై వచ్చిన నావను చేరి, చెట్లు, తీగలు, ఔషధాలు మొదలైన వాటి విత్తనాలన్నీ అందులో

ఉంచి, మునులతో కలిసి హరి ధ్యానం చేస్తూ నావను ఎక్కాడు. అటుపైన తనకు ఎదురైన మత్స్యేంద్రుని కొమ్ముకు ఒక పెద్ద పామును తాడుగా చేసి యీ నావను కట్టాడు. "స్వామీ, మేము ఒక గ్రుడ్డి వానిని పట్టుకొని నడిచే మరో గ్రుడ్డివాడి వంటి మూర్ఖులం. నీవు స్వయంగా సూర్యుడే కన్నుగా చూడగలవాడవు. నీ సేవ వలన మా పాపాలు నశించి ముక్తి ప్రాప్తిస్తుంది. నీవే మాకు సర్వస్వం. నా లోపల ఉన్న కాలుష్యాన్ని నశింపజేసి నన్ను నీలో ఐక్యం చేసుకో" అని ప్రార్థించాడు సత్యవ్రతుడు. అతడే తదుపరి ఏడవ మనువయ్యాడు. అటుపైన విష్ణువు హయగ్రీవుని వధించి వేదాలను తెచ్చి బ్రహ్మకు ఇచ్చినాడు.

ఈ సత్యవ్రతుని కథ ఎన్ని వేల ఏళ్ల క్రిందటో వ్రాయబడిన భాగవతం లోనిది. ఇలాంటి కథే "నోవాస్ ఆర్క్" అన్న పేరుతో 2000 సం॥ క్రిందటి బైబిల్‌లో కన్పిస్తుంది. భారతీయ సాహిత్యంలో లేని విశేషాలు విదేశీ సాహిత్యంలో మరెక్కడా కన్పించవన్న సూక్తికి యీ కథ తిరుగులేని నిదర్శనం.

## మంచి మాట

నిజానికి ప్రపంచములో ఏ వ్యక్తీ సర్వజ్ఞుడు కాడు. చాలా గొప్ప సైంటిస్టుకి ఏయే పాళ్ళు వేస్తే కూర రుచిగా వస్తుందన్న అతి చిన్న విషయం తెలియక పోవచ్చు! దేశాన్ని పరిపాలించే మహానాయకుడికి శృతి తప్పకుండా పాడటం చేతకాకపోవచ్చు! కవులకు కలంకారీ పని రాకపోవచ్చు! నృత్య కళాకారుడికి న్యూటన్ సిద్ధాంతం తెలియకపోవచ్చు! ఆర్ట్సు లెక్చరర్‌కు లెక్కల్లో సున్నా రావచ్చు! అరవీర భయంకరుడైన సైన్యాధ్యక్షుడికి సున్నితమైన శృంగారం ఏమిటో తలకెక్కకపోవచ్చు! ఎవరి రంగు వారిది, ఎవరి ప్రతిభ వారిది. ప్రతి మనిషికి తనదైన ఓ మేధస్సు ఉంటుంది. నాకు తెలుసు అన్న ఆత్మవిశ్వాసం మనిషిలో ఉండితీరాలి. నాకు మాత్రమే తెలుసు అనుకుంటే మాత్రం అహంభావం అవుతుంది. ఈ రెండూ లేకపోవడమే ఆత్మన్యూనతా భావం. మొదటిదైన ఎరుక మనిషికి ఆత్మవిశ్వాసం కల్గిస్తుంది. అహంభావం మనిషిని అథఃపాతాళానికి పడదోస్తుంది.







## ఆశీరక్షతలు



సాయిదివ్య, సాయిధామంలో పెరిగి ఏం.ఏ, బి.ఇడి చేసి వివాహితయై, ఇద్దరు పిల్లల తల్లై అస్సాంలో ఉంటున్నది. ఆమె భర్త అశోక్‌రాజు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగి. అతడు, దివ్య తమ ఆడపడచు **చి॥ వాణిశ్రీ వివాహం చి॥ కుమారస్వామితో 29వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు** నిర్వహించారు. మెదక్ జిల్లా జోగిపేటలోని వాసవీ కళ్యాణ మంటపంలో శాస్త్రోక్తంగా నిర్వహించబడిన యీ కళ్యాణోత్సవం కన్నుల పండువుగా జరిగింది. విద్యాధికులైన యీ నవదంపతులు పరస్పరాను రాగంతో అన్యోన్యంగా జీవించి, తమ సంతతిని లోకోపకారకులుగా తీర్చిదిద్ది ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవులు తమ ప్రేమాశీస్సులు అందిస్తున్నారు. కన్యాదాతలైన దివ్య, అశోక్‌లకు సాయిధామం నూతన వస్త్రాలు అందించింది.

శ్రీమతి బి.జయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగిని. చిరకాలంగా ఆశ్రమాభిమాని. మాతాజీకి పూర్వ విద్యార్థిని (35 ఏళ్లనాడు) కూడా. మంచి దాతృత్వ శీలం గల భక్తురాలు. ఆమె తన పుత్రుడు **చి॥ విజయభాస్కర్‌కు చి॥సౌ॥ కమలాత్మికతో** కళ్యాణ క్రతువు నిర్వహించింది. **మేనెల 28వ తేదీ వేకువజామున గం.4.08 ని.లకు** నోమా కళ్యాణమంటపంలో వైభవంగా జరిగిన యీ సంరంభానికి సాయిధామం ఆశ్రమవాసులైన కొందరు పిల్లలు, ఆనందంగారు, చంద్రారెడ్డి తదితరులు గురుదేవులతో కలిసి వెళ్ళి శ్రీ సాయి ఆశీస్సులు అందించారు. ఉన్నత విద్యావంతులైన యీ వధూవరులు కలకాలం స్నేహానురాగాలతో వర్ధిల్లి, తమ సంతతిని దేశమాత శ్రీచరణాలకు సమర్పించగల స్థాయిలో పెంచి ధన్యులు కావాలని ఆశ్రమములోని అందరు గురుదేవుల మంగళాశీస్సులను ప్రతిధ్వనించారు. తథాస్తు!

# "ఎల్లాం సామి అనుగ్రహం దా!"

- "నడిచే దేవుడు" నుండీ

(స్థపతి అంటే శిలావిగ్రహాదులు చెక్కి దేవాలయాలను, నాట్య మంటపాలను, రాజభవనాలను కళాసంపన్నం చేసేవాడని అర్థం)

సుబ్బయ్య స్థపతికి తెలుగు బాగా రాదు. కంజీవరం వాస్తవ్యుడు కావడం చేత.

మా ఆవిడకు అరవం వచ్చు. అరవం అర్థం చేసుకోనడమేగాక, అరవ వారితో ధారాళంగా ఆ భాషలో మాట్లాడుతుంది. శ్రీశైలం శిల్పం పనిమీద, సుబ్బయ్య స్థపతి కంచి నుంచి బయలుదేరి విజయవాడ వచ్చాడు. ఒకరోజు మా ఇంట్లో ఆగాడు.

నా భార్య శ్రీమతి వెంకాయమ్మా, సుబ్బయ్య స్థపతీ, కంచి కామకోటి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామిని గురించి భక్తితో, ఆసక్తితో మాట్లాడుకున్నారు. ఒకరి అనుభవాలు ఒకరికి చెప్పకున్నారు.

సుబ్బయ్య స్థపతి తమిళంలో చెప్పిన అనుభవ సారాంశం ఇది.

✡ ✡ ✡

రామేశ్వరంలో అగ్నితీర్థానికి ఎదురుగా సముద్రతీరంలో ఆదిశంకర మంటపం నిర్మించాలని స్వాములవారు సంకల్పించారు. మంటపం అగ్ర భాగంలో ఆదిశంకర భగవత్పాదుల విగ్రహమూ, ఆయన నలుగురు శిష్యుల విగ్రహాలూ నెలకొల్పడానికి నిశ్చయించారు. చలవరాతితో తయారుచేసిన ఆ అయిదు విగ్రహాలూ ఒక్కొక్కటీ మనిషి ప్రమాణం కంటే పెద్దవి.

"మంటపంతోపాటు విగ్రహాలు తయారుచేసే మొత్తం పని నాకు అప్పగించారు స్వామివారు. పుణ్యకార్యం కావడం చేతా మొత్తం బాధ్యత స్వామి నాపైన పెట్టడం వల్ల భక్తితో నడుంకట్టి పనిలోకి దిగాను.

అడపాతడపా కంచికి వచ్చేవాణ్ణి. మఠంలో స్వామిని సందర్శించి





మంటపం పనిగురించి వారికి నివేదించేవాణ్ణి. ఆ సందర్భంలో ఒకసారి స్వామికీ నాకూ ఇలా సంభాషణ జరిగింది.

**స్వామి :** ఏం స్థపతీ, ఎట్లా నడుస్తున్నది మంటపం పని? అనుకున్నట్లు జరుగుతున్నదా? అక్కడ మీకు ఇబ్బందులేవీ లేకుండా సౌకర్యాలన్నీ అమురు తున్నవా? మనం పెట్టుకున్న ముహూర్తానికి మొత్తం పని పూర్తి అవుతుందా?

**స్థపతి :** సామీ, పని సాఫీగానే జరుగుతున్నది. మాకే కొరతా లేదు. ఏ నెల కానెల పనివాళ్లందరికీ జీతాలు సక్రమంగా ముడుతూనే ఉన్నవి. తమ దయా, కామాక్షీ అమ్మవారి కటాక్షం ఉంటే, మనం పెట్టుకున్న ముహూర్తం నాటికి అంతా సిద్ధమవడానికి ఏ ఆటంకం ఉండదు. కానీ,

**స్వామి :** ఏమిటి 'కానీ' అంటున్నావ్?

**స్థపతి :** (మౌనం)

**స్వామి :** ఎందుకట్లా మాట్లాడకుండా ఉంటావు? సందేహం లేకుండా ఉన్నదున్నట్లు చెప్పు.

**స్థపతి :** అంతా సవ్యంగానే జరుగుతూ ఉన్నది సామీ! ఒక్కటే చిన్న ఆటంకం.

**స్వామి :** నీళ్ళు నమలకుండా చెప్పు స్థపతీ! నాతో చెప్పడానికి నీకేం భయం? ఏమి జరిగిందో వివరంగా చెప్పు.

**స్థపతి :** శంకరుల వారి విగ్రహం నేనే స్వయంగా చెక్కుతున్నాను సామీ! ఇన్నాళ్లబట్టీ పని చకచకా సాగుతూనే వచ్చింది. అయితే, విగ్రహం ముఖం మీద, కంటికి సమీపంలో అంగుళం వెడల్పున ఒక నల్లని మచ్చ కనిపించింది. అది రాతిలోనే ఉన్నది. ఇంతకాలంగా అది పైకి రాలేదు. ఇప్పుడే బయటపడింది. అదెంత లోతుగా ఉన్నదో చెప్పలేను. కొంత చెక్కి చూశాను. తగ్గడం లేదు. ఏమి చెయ్యడానికీ తోచడం లేదు. ఆ అభ్యంతరం ఒక్కటీ తీరిపోతే, విగ్రహాలన్నీ ముహూర్తం నాటికి తయారైనట్టే.

**స్వామి :** ఇది నిజమైన ఆటంకమే! అందులో మూలవిగ్రహానికి, ఇంకోచోట,

ఇంకోచోటగాక నొసటి మీదనే ఆ మచ్చ ఉండరాదు నిజమే, కానీ ప్రయత్నం చేయి. అమ్మ అనుగ్రహిస్తే, అంతా అనుకూలంగా జరగవచ్చు. స్థపతి స్వామికి నమస్కారం చేసి, సెలవు తీసుకొని రామేశ్వరం వెళ్ళాడు. నెలరోజుల తరువాత మళ్ళా ఒకసారి కంచి వచ్చి మఠంలో స్వామిని దర్శనం చేశారు. మంటపం పని ఏదేది ఎంతవరకు వచ్చిందో సవిస్తరంగా స్వామికి నివేదించాడు.

అంతా విని స్వామి అడిగారు : "సరే గాని, కిందటిసారి నీవు వచ్చినపుడు శంకరుల విగ్రహానికి నొసటిపైన రాతిలో మచ్చ కనిపించిందన్నావే, అదేమైంది? దాని సంగతి చెప్పలేదేం?" అడిగారు.

**స్థపతి :** (నవ్వు ముఖంతో) సామీ, దాని పరిమాణంలో కొంత తగ్గింది. ఇంకా ఒక కాసు వెడల్పు ఉన్నది.

**స్వామి :** సరే. నీవు చేయవలసిన ప్రయత్నమంతా చేస్తూ ఉండు. దాని సంగతి విచారించకు. ఇక వెళ్ళు.

ఇదే విధంగా స్థపతి మరి మూడు, నాలుగు సార్లు కంచి వెళ్ళి, స్వామిని సందర్శించడం, మండప నిర్మాణం ఎంతవరకు వచ్చిందీ స్వామికి నివేదించడం జరిగింది.

వెళ్ళినప్పడల్లా ఆ మచ్చను గురించి స్థపతిని అడుగుతూ ఉండేవారు. మచ్చ ఏమాత్రం తరిగిపోయిందో స్థపతి స్వామికి విన్నవించేవాడు.

చివరకు మంటపం పని యావత్తూ పూర్తి అయింది. అనుకున్న ప్రకారం మంటపానికి ప్రారంభోత్సవం జరగవలసి ఉన్నది. కడపటి దఫా స్థపతి స్వామిని సందర్శించడానికి వచ్చాడు. స్వామి మళ్ళా స్థపతిని అడిగారు. "ఏమైంది విగ్రహం ముఖం మీద ఆ మచ్చ?" స్థపతి కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. స్వామికి సాష్టాంగ నమస్కారంచేసి "సామీ! సామీ! వెంట్రుకవాసి కూడా లేకుండా మచ్చ పూర్తిగా మాయమయింది. ఎల్లాం సామి అనుగ్రహం దా!" అంటూ ఆనందబాష్పాలు తుడుచుకున్నాడు.





# నాడూ అంతే-నేడూ అంతే

– "భగవాన్ స్మృతులు" నుండీ

మాణిక్య వాచకర్ మధురలో పాండ్యరాజు దగ్గర మంత్రిగా ఉండేవారు. రాజు డబ్బిచ్చి మంత్రిని వెళ్ళి వెతికి ప్రశస్తమైన గుర్రాలను కొనుక్కు రమ్మన్నాడు. గుర్రాలకోసం ఊళ్ళు తిరుగుతూ ఉండగా, ఒక గ్రామంతో ఈశ్వరుడు మాణిక్య వాచకర్‌కి దర్శనమిచ్చి, అక్కడే తనకి ఓ ఆలయం కట్టమన్నారు. తన దగ్గర ఉన్న రాజుగారి ధనంతో ఓ ఆలయం కట్టించి, భక్తుల్ని పోగు చేసి భగవత్ సంకీర్తనలో కాలం గడుపుతున్నారు మాణిక్యవాచకర్. రాజ భటులు వచ్చి గుర్రాల సంగతి జ్ఞాపకం చేశారు.

దేవుడా, ఏం చెప్పను రాజుకి? మాయా ప్రపంచం నా నెత్తిమీద పడ్డది అన్నారు మాణిక్య వాచకర్. ఈశ్వరుడు కనపడి -

'వెళ్ళి రాజుతో చెప్పు. నెల లోపల గుర్రాలు వస్తాయి" అని అన్నారు.

మాణిక్య వాచకర్ వెళ్ళి ఆ ప్రకారం రాజుతో చెప్పి అక్కడే ఉన్నారు. నెల అయింది. అడవిలోని తోడేళ్ళనన్నిటినీ పంచకళ్యాణి గుర్రాలుగా మార్చి రాజుగారి దివాణానికి తోలుకొని వస్తున్నారు పరమేశ్వరుడు గుర్రాల కాపరి వేషంతో. ఆ గుర్రాల్ని చూసి రాజు ఆనందభరితుడైనాడు, ఆ గుర్రపు కాపరి "గుర్రాలు ఇవిగో, నేను వెడుతున్నాను" అన్నారు. రాజు ఆ కాపరిని చూసి విడువలేక నమస్కరించాడు.

రాత్రికి గుర్రాలన్నీ తోడేళ్లై అడవిలోకి పారిపోయినాయి.

రాజు ఉగ్రుడై, తనని మోసం చేశాడని ఎండలోపెట్టి కొట్టమన్నాడు మంత్రిని.

ఒక వారం కొట్టారు. మాణిక్య వాచకర్ ఒకటే ఏడ్చాడు, ఈశ్వరుడితో చెప్పకుని.

మధురపట్నం పక్కన ఉన్న వైఘై నదిలో ఆకస్మాత్తుగా వరదలు తెప్పించారు ఈశ్వరుడు. పట్టణం మునిగిపోవడానికి సిద్ధమయింది. ఊరి వాళ్ళని నదికి కట్ట వెయ్యమన్నాడు రాజు. ఇంటికి ఒకడు చొప్పన వచ్చి

మన్ను తవ్విపొయ్యాలి. ఒక ముసలి వితంతువు పుట్టు కుడుములు చేసి అమ్ముకునేది, ఆమెకి తన ఇంటి తరఫున పంపడానికి ఎవరూ లేరు. ఎట్లాగా అనుకుంటూ ఈశ్వరుణ్ణి తలుచుకుంది. పరమేశ్వరుడు వడ్డెవాడై వచ్చి వాకిట నిలిచారు, కూలివాడు కావాలా అని అరుస్తూ.

"నీకేమి కూలి ఇవ్వాలి?" అని అడిగింది ముసలమ్మ. "నువు చేసే కుడుముల్లో విరిగి ముక్కలైనవి నాకు కూలి కింద ఇయ్యి, చాలు" అన్నాడు కూలీ. ఆ ముసలమ్మ సరేనంది సంతోషంతో. ఆమె చాలా నేర్పరి. ఏ కుడుమూ ముక్కలు కాదు ఆమె చేస్తే. చాలా మంచి బేరం అనుకుంది. అతను కట్ట వెయ్యడానికి నది దగ్గరికి వెళ్ళిపోయాడు.

ఆనాడు ఇక్కడ ఆమె కుడుములన్నీ ఎన్నిచేస్తే అన్నీ విరిగిపోయినాయి. వడ్డెవాడు పనికి వెళ్ళాడేకానీ తన వంతుకు వచ్చిన కట్టను వెయ్యనే లేదు. ఇంటికి వచ్చి పుట్టు కుడుము ముక్కలన్నీ తిని ఒక చెట్టు నీడలో పడుకొని నిద్రపోతున్నాడు. రాజు తనిఖీకి వచ్చి, పని చెయ్యని కూలీని చూచి కర్రతో కొట్టాడు. ఆ వడ్డె వాడిని కొట్టిన దెబ్బ రాజు వీపుమీద, మంత్రుల వీపు మీద, అక్కడ ఉన్న వారి వీపుల మీద, దేవలోకంలో ఈశ్వరుడి వీపు మీద తగిలింది. ఆ కూలీ అతను కనపడలేదు. రాజు మంత్రి పాదాల మీద పడ్డాడు క్షమించమని.

ఒక రోజు నా భార్య దోసెలు చేస్తోంది. "విరిగినవన్నీ కూలీ ఈశ్వరుడికి" అని నవ్వుతూ వెళ్ళిపోయినాను. ఆకలితో దోసెలు తినాలని ఇంటికి వచ్చాను. "అన్ని దోసెలు ముక్కలై వచ్చాయి" అని ఆ ముక్కల్ని చూపింది నా భార్య, ఏం చెయ్యను? ఏమీ అనకుండా అన్నీ భగవాన్ దగ్గరికి తీసుకునిపోయి వారి ముందరపెట్టాను.

"ఏమిటిది?" అన్నారు.

"నా భార్య దోసెలు చేస్తూ ఉంటే నవ్వులాటకి నేను, మాణిక్య వాచకర్ కథలో మల్లే విరిగినవన్నీ ఈశ్వరుడికి అనేసి వొచ్చాను. ఒకటీ సరిగా రాలేదు. ఈ ముక్కలన్నీ మీవి గనుక మీకు తీసుకొచ్చాను" అన్నాను. నవ్వుతూ ఆయన నాలుగు ముక్కలు తిని తక్కినవి భక్తులకు పంచిపెట్టించారు.





# అనుభవాలు-అనుభూతులూను-౧

- శుకవాణి

మాంచి వేసవికాలం మే నెల - అందునా తిరుపతి - అక్కడా పెళ్లి. 'అయ్య బాబోయ్!' అనిపించింది. కానీ, బాగా దగ్గరివారింట్లో వివాహం. ఎవరో ఒక్కరైనా వెళ్ళకపోతే మర్యాద కాదు. వేసవికాలపు సెలవులు కాబట్టి నేనే వెళ్ళాలి. పైగా వెళ్ళేప్పుడు రైలు టిక్కెట్లు కూడా పెళ్లి వారు బుక్ చేసేసారని జ్ఞాపకం. నాకేమో పెళ్లిళ్ల, పేరంటాలూ, బంధుమిత్రుల విందులు, హడావుడీ, పట్టుచీరలూ, పట్టెడు నగలూ ఇవన్నీ పెద్దగా ఆసక్తికరంగా అనిపించవు. ఏమిటో కంగారు కంగారుగా ఉంటుంది అలాంటప్పుడు. అందుచేత కాస్త బిక్కు బిక్కుమంటూనే బయలుదేరాను. రైలు ప్రయాణం రాత్రిపూట గనుక హాయిగానే జరిగింది. తిరుపతి కొండపైన విడిదిలో దిగాం. మధ్యాహ్నం నుంచీ పెళ్లి హడావుడి మొదలైంది.

ఇరువైపుల వారూ కావలసినవారే. వధూవరులు మేనత్త మేనమామ బిడ్డలు. విద్యావంతులు. కాస్త కలిమిగలిగిన వాళ్లు కావటంతో పెట్టుపోతలు, మర్యాదలు అన్నీ ఘనంగానే జరుగుతున్నాయి. సరసాలు, సరదా కబుర్లు, వరసైన వారి ఛలోక్తులు, మధ్య మధ్య కాస్త చురుకుగా, కారంకారంగా నాజూకు విమర్శలు-అంతా ఉత్సాహంగా, కోలాహలంగా ఉన్నది. నేను క్లాస్ వన్ మూగమొద్దులాగా అన్నీ గమనిస్తూ, వింటూ, ఆశ్చర్యపోతూ, ఆనందపడుతూ కూర్చున్నాను. చెలిమితో నిండిన గుంపుల్లో తప్ప, కలిమితో కూడిన జనాల మధ్య స్వేచ్ఛగా యిమడలేని ప్రవృత్తి నాది. వాళ్లు మంచి వాళ్ళే ఐనా నా అందునా ఆ వేడిలో-స్థూలకాయంతో.... పాపం, నేను!

సరే-పెళ్లి సలక్షణంఆ జరిగింది. అమ్మాయి తల్లిదండ్రులు, అబ్బాయి తల్లిదండ్రులు కూడా చుట్టాలమే గదా!' అన్నట్లు కాకుండా కొత్త

బంధువులకు ఎలా అన్నీ జాగ్రత్తగా అమరుస్తారో అలాగే చూచుకొన్నారు. అర్ధరాత్రివేళ నవవధూవరులకు వేంకటేశ్వర స్వామి దర్శనం ఏర్పాటైంది. వెంట వెళ్లిన వారిలో నేనూ ఉన్నాను. (ఎప్పటినుంచో కొత్త చెప్పలు కొనుక్కుందామనుకొంటూ వాయిదా వేస్తున్నానప్పటికి. స్వామి ఆలయంలోకి వెడుతూ ఉన్న జత బయట వదిలేసి, ఇవెవరైనా వేసుకుపోతే ఎంచక్కా దిగువ తిరుపతిలో మంచి చెప్పలు కొనుక్కోవచ్చుననుకొంటూ లోపలికి వెళ్లాను.) మా వెనక వేరే ఎవ్వరూ లేరు గనుక దర్శనం తాపీగా జరిగింది ఆనందప్రదంగా. అంతకుముందు రెండుసార్లు తిరుపతి వెళ్లాను కానీ, అలా రాత్రివేళ ప్రశాంతంగా దర్శనం చేసుకోవటం మంచి అనుభవమే. అరగంట పట్టింది ప్రదక్షిణ చేసి బయటికి రావడానికి. నా చెప్పలు కొంటెగా చూస్తూ అక్కడే ఉన్నాయి నాకోసం. "నిను వీడని నీడను నేనై' అన్న పాట గుర్తు వచ్చింది. మొత్తం మీద వాటినే వేసుకొని విడిదికి చేరాను.

మర్నాడు ప్రొద్దున్నే ఏడయ్యేటప్పటికే టిఫిన్లు చేసి, దారిలో భోజనాలు చెయ్యడానికి వీలుగా పెద్దపెద్ద కేన్‌ల నిండా అన్నం, సాంబారు, పెరుగు సిద్ధం చేయించారు. మధ్యాహ్నానికంతా విజయవాడ పరిసరాల్లోకి వెళ్లిపోతే భోజనాలు చేసి గుడివాడ వెళ్లిపోవచ్చుననుకున్నారు. ఓ ప్రైవేటు బస్సులో ప్రయాణం ప్రారంభమైంది. పదకొండయ్యేటప్పటికి పైనున్నది ఏకాదిత్యుడా, ద్వాదశాదిత్యులా అనిపిస్తోంది నా ప్రాణానికి. ఎండకు తోడు విపరీతమైన ఉక్కపోత బస్సులో. ఫేన్లు బయటి వేడిని మరింత మోసుకొస్తున్నాయి-గాలితోపాటు. అందరూ బాగా అలిసిపోయి ఉన్నారు. రాత్రి సరిగా నిద్రలేమి వలన దాదాపు అందరూ వధూవరులతో సహా జోగుతున్నారు-వాడి పుణ్యమా అని రథచోదకుడూ, తన ఈలపాటలతో అతనికి హుషారెక్కిస్తున్న క్లీనరూ తప్ప. నా ప్రాణానికి ఆ నిద్రాభాగ్యం కూడా దక్కలేదు. ఆపాదమస్తకం చెమటతో తడిసి, ఏ పల్లెటూళ్లోంచీ వెళ్లేటప్పుడో చెట్ల గాలికి రవంత





ఆరి, మళ్లీ తడిసి, మళ్లీ ఆరి .... "పునరపి జననం పునరపి మరణం" అన్న ముక్క గుర్తు వచ్చింది. ఎటొచ్చీ జననీ జఠరం యీ బస్సంత వేడిగా ఉంటే మాత్రం ఒక్క శిశువూ బయటికి రాదు-లోపలే మాడి మసైపోవాలే తప్ప. గ్రీష్మతీవ్రతకు తలతిక్క ఆలోచనలెప్పుడూ తోబుట్టువులే.

ఎలాగో అలా మధ్యాహ్నం ఒంటి గంటయింది. నెల్లూరుకింకా అవతలే ఉండిపోయాం. పొద్దున టిఫిన్ తరువాత "మధ్యే మధ్యే నారి కేళోదకం సమర్పయామి" అంటూ ఆత్మారాముడిని సంతృప్తిపరచే ప్రయత్నాలు చేసినా లాభం లేక వాడు చెలరేగి గోలపెట్టడం మొదలుపెట్టాడు. దాదాపు అందరి పరిస్థితి అదే. ఓ అరటితోట ప్రక్కన, చిన్న చెరువు దగ్గర బస్సు ఆపారు. సరే అక్కడ చల్లని నీళ్లతో కాస్త ముఖాలు కడుక్కొని సేద తీరాము. ఆహారపదార్థాలు కూడా బస్సు దిగాయి. పేపరు ప్లేట్లు తలోటి తీసుకున్నారు.

వధువు తల్లి పచ్చళ్ల డబ్బాలు కూడా కిందకు దించారు. అన్నం మీద మూత తీసిన బంధువొకాయన "అయ్యో!" అని ఒక ఆర్తనాదం చేసారు ఏమిటేమిటని అందరూ ఆత్రంగా అడిగితే ఆయన అన్నం పైకి ఎత్తి చూపారు గరిటతో. అది నీళ్లు కారిపోయింది. మరొకరు సాంబారు మూత తీసి చూసారు ఘోరంగా చెడిపోయి వాసన వస్తున్నది. టక్ మని మూత పెట్టేసారు. అన్నం పాచిపోలేదు కాని ఎండ తీవ్రతకు ఉక్కిపోయింది. ఆడ పెళ్లి వాళ్ల ముఖాలు చిన్నపోయాయి. నెల్లూరింకా పదిమైళ్ల పైన ఉంది. ఒకవేళ అక్కడికి వెళ్లినా సుమారు రెండుగంటల వేళ ఇంతమందికి ఒక్కసారే మంచి భోజనం దొరుకుతుందన్న నమ్మకం లేదు. ఎంత అయిన వాళ్లు అయితే మాత్రం వియ్యాల వారికి వేళకు భోజనం పెట్టలేకపోతే ఏం బాగుంటుంది?

ఎవరో ఒక వరుసయ్యే ఆవిడ కొంటెగా నవ్వుతూ "ఎలక్షన్లలో ఓటు వెయ్యడానికి ముందు రాచమర్యాదలన్నీ చేసి మరీ తీసుకువస్తారు. ఆ

ముద్ర కాస్తా పడిపోయాక మీ ఖర్మ ఎలా పోతారో పొండి అని వదిలేసారు. ఇప్పుడూ ముద్రపడిపోయిందిగా మరి! అంతేనంటారా వదినగారూ!" అన్నది. నవ్వలేక నవ్వారు అందరూ నీరసంగా. అంతలో ఒక ఆజాను బాహుడు, స్ఫూరద్రూపీ వయసు మళ్లిన పెద్దాయనొకరు ముందుకు వచ్చారు.

"ఒరేయ్! ఏమిట్రా అలా నిలుచుండిపోయారు? ఒరే! చిన్నోడా నాకు పెళ్లిలో పెట్టిన కొత్త పంచెలు ఉన్నాయి. తీసుకురారా! ఆ నీళ్ల మడుగులో శుభ్రంగా జాడించుకురా" అని గంభీరమైన కంఠంతో అన్నారు. ఆయన అబ్బాయి తాతగారు. అందుచేత ఇద్దరికీ బాగా కావలసినవారు. వివేచన, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణం ఉన్నవారు. సదరు చిన్నాడు పంచలు తడిపి తేగానే "అలా పచ్చగడ్డి మీద పరువు" అన్నారు. అతను పరవగానే "అలా చూస్తారేమిటే అమ్మాయ్ ఆ అన్నంలో సగం ఇలా గుమ్మరించండి" అన్నారు. ఓ ప్రక్క ఆవకాయ, మరోప్రక్క గోంగూర వేయించారు అన్నం మీద. తామే స్వయంగా పూనుకొని కలపబోతే ఆడవాళ్లు ముందుకు వచ్చి, "మేము చేస్తాం మీరు తప్పకోండి" అని పనిలో పడ్డారు.

అందరి చేతుల్లోకి ప్లేట్లు వచ్చాయి. తాతగారు స్వయంగా వధూవరులకు ఆవకాయ అన్నం పెట్టారు. ఓ అయిదు నిముషాల్లో అందరికీ అందింది. అది తినేలోపే పెద్దపెద్ద గోంగూర పచ్చడి ముద్దలు వచ్చాయి. ఆవురావురుమని తింటున్నారు అందరూ. నాకు యశోదమ్మ కృష్ణయ్యకు పెట్టిన ముద్దల గురించి "ఇదిగో చిన్ని కృష్ణుడు భూగోళమంత ముద్దలు గబగబా తినేసేవాడు" అని మా అమ్మచెబుతూ నాకు అన్నం పెట్టడం గుర్తుకు వచ్చింది. మిగిలిన అన్నం కూడా పంచెల మీద పోసారు. పెరుగు గుమ్మరించారు. ఒక్కొక్కరికి పెరుగుముద్ద, నంజుకోవడానికి ఆవకాయ బద్ద వడ్డించారు. తన కడుపు నిండాక గుర్తుకు వచ్చాడు తాతయ్య ఓ మనవడికి. నువు కూడా తిను తాతయ్యా అన్నాడు "అబ్బా, ఇప్పడు గుర్తుకు






వచ్చానురా" అన్నారు తాతయ్య. తాతయ్య తింటుంటే మంచినీళ్లు అందిస్తూ "మెత్తబడిన అన్నంలో ఆవకాయ కలిపితే ఇంత బాగుంటుందని నాకు తెలియదు తాతయ్యా" అన్నాడు ఒక యువకుడు. ఆడ పెళ్లి వాళ్ల ముఖాల్లో పరువు నిలబడిందన్న ధైర్యంతో నవ్వులు వెల్లివిరిసాయి. "నాలుగు రకాలూ చేసి టేబుల్ మీద పెడితే ఏ ఒక్కటీ తృప్తిగా తినవుకాని యిప్పడు ఎలా తిన్నావురా" అన్నది యువకుడి తల్లి. తాతగారు నవ్వారు.

"చూడమ్మాయీ! మనిషి ప్రకృతిలో భాగం. చెట్ల క్రింద కూచొని, చేను గట్ల మీద కూచొని, నలుగురితో కలిసి కూర్చొని, నలుగురితో ఉన్నది పంచుకొని తినడంలో ఉన్న ఆనందం మన ఇంట్లో మనం ఎంత తిన్నా రాదు. నలుగురూ మంచి మనస్సుతో కలిసినచోట నారాయణమూర్తి ఉంటాడే అమ్మా! అప్పడు తినేది మామూలు అన్నం కాదు ప్రసాదమే అవుతుంది!" అన్నారు తాతగారు. తమ సమున్నతమైన వ్యక్తిత్వాన్ని మరింత ప్రస్ఫుటం చేస్తూ.

ఎంత సుకుమారంగా చటుక్కున నిర్ణయం తీసుకొని వ్యవహారాన్ని సానుకూలం చేశాడీ పెద్దమనిషి! ఆకలి రుచి ఎరుగదు. ఏది దొరికితే అప్పటికి అదే పరమాన్నం. ఈ చిన్న రహస్యం తెలిసిన వారు కావటంతో-తన పెద్దరికాన్ని, వాత్సల్యాన్ని కూడా కలిపి, ఎంతో చికాకు కలగవలసిన సందర్భాన్ని ముచ్చటగా తేల్చేసారు. ఆ పెద్దమనిషి కామినేని బాపనయ్యగారు కాలం చేసి చాలాకాలం అయింది. కానీ నా స్మృతిపథంలో చిరంజీవిగా నిలిచిపోయారు. "బస్సు ఎక్కండి అందరూ. ఇదిగో ఇంటికి వెళ్లాక నాకు మరో జత పంచెలు కొనడం మరచిపోకండీ" అన్నారు తాతగారు. అందరూ పక పకా నవ్వారు. ఆ తరువాత ఎండ వేడిగా అనిపించలేదు. ఒట్టు.

నాకు ఎదురైన ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను తాతగారి స్ఫూర్తితో పరిష్కరించుకోగలిగాను అటుపైన నేను నా జీవితంలో.

# శుకవాణి



- మాతా శుకవాణి

పోతన్నగారు భాగవత ప్రారంభ పద్యాలలోనే మధువులు చిందించారు. "శ్రీకైవల్య పదంబు జేరుటకునై .... " వ్రాస్తున్నానిది - అంటూ దేవతా స్తుతిలోనే ఎన్నెన్నో సొగసులు చిందించారు. అమ్మలగన్న అమ్మ దుర్గమ్మను, భారతీదేవిని, ఆదిలో గణపయ్యను ప్రార్థించాక - భాగవతం గొప్పదనాన్ని యిలా వర్ణించారు. ఇది రెండర్థాల శ్లేషపద్యం.

"లలితస్కంధము కృష్ణ మూలము, శుకాలాపాభిరామంబు, మం
జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్, సుందరో
జ్జ్వల వృత్తంబు, మహా ఫలంబు, విమల వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్విజశ్రేయమై"

- ఈ పద్యంలో ప్రతి శబ్దమూ ఒక ప్రక్క భాగవతానికీ, మరోప్రక్క కల్పవృక్షానికీ కూడా అన్వయిస్తుంది. లలితస్కంధము - చక్కని స్కంధాల క్రింద విభజించబడింది భాగవతం, నున్నని మొదలు గలది కల్పతరువు. కృష్ణమూలము = శ్రీకృష్ణుడే మూలదైవం భాగవతానికి, చేవదేలిన నల్లని మూలభాగం గలది కల్పతరువు. శుకమహర్షి యొక్క పలుకులతో మనోహరం భాగవతం, చిలకల పలుకులతో మధురం వృక్షం. మార్దవంతో (మృదు భావాలతో) నిండినది భాగవతం, మెత్తని తీగలతో ప్రకాశించేది తరువు. చక్కని అక్షరాల కూర్పుతో సహృదయులందరికీ (దేవతలకు సైతం) చక్కని ఆనందాన్ని, జ్ఞానాన్ని ఇచ్చేది భాగవతం, బంగారు వన్నెగల పుష్పాలతో నిండినది కల్పవృక్షం. అందమైన మత్తేభ శార్దూలాది ఛందో వృత్తాలతో నిండినది భాగవతం, వంకరటింకరగా గాక చక్కగా గుండ్రంగా





ఎదిగినది కల్పతరువు. విన్నంతనే చదివినంతనే అద్భుత ఫలితాలను (ఆధ్యాత్మిక) ఇవ్వగలది భాగవతం, పెద్ద పెద్ద పండ్లనిచ్చేది వృక్షం. నిర్మల చిత్తుడైన వ్యాసభగవానుడే పాదుగా నిలచి పెంచినది భాగవతం, వంపులు లేక అన్నివైపులా సమమైన వ్యాసంతో ఏర్పడిన పాదు గలది కల్పతరువు. అలాంటి యీ భాగవతమనే పేరు గల కల్పతరువు సత్ ద్విజ-సద్బ్రాహ్మణులకు క్షేమం కలిగించేదీ, మంచి పక్షులకు ఆశ్రయం కలిగించేదిగానూ కూడా ప్రకాశిస్తుంది. (ద్విజుడు జన్మతః శూద్రుడై ఉపనయనంతో మాత్రమే బ్రాహ్మణుడవుతాడు. ద్విజం జన్మతః గుడ్డై, పొదిగాక పిల్లగా రూపొందుతుంది.)

ఆ విధంగా పోతన్నగారు భాగవత కల్పవృక్షాన్ని రసరమ్యంగా పాఠకలోక హృదయానందకరంగా వర్ణించారు. భాగవత భావాన్ని శిరస్సున దాల్చినా- కల్పవృక్షం క్రింద కూర్చుని భావించినా జయం తథ్యం.

# మాతృసంస్థ కబుర్లు

ఏప్రిల్ 11వ తేదీతో శ్రీ సాయి విద్యాధామం పిల్లలకు పరీక్షలై పోయాయి. ఆ మరునాడు ప్రారంభించి 22వ తేదీవరకు 11 రోజులపాటు బాల, విద్యార్థి శిక్షణ శిబిరం నడిపింది సాయిధామం. ప్రాథమిక పాఠశాలా విద్యార్థులకొకశాఖ, ఉన్నత తరగతుల వారికి మరో శాఖగా ఈ శిబిరం నడిచింది. యోగాసనాలు, ఓం కారం, ధ్యానం తొలి విభాగం. తరువాత ఉపాహారం. అటుపైన శ్లోకాలు, పద్యాలు నేర్పడం. ఆ తరువాత దేశభక్తి గేయం, భజన. అవి వచ్చాక ఎవరైనా మహనీయుల లేదా ఖుదీరాంబోస్ వంటి దేశభక్తుల గాథలు లేదా చాణక్యుని వంటి చారిత్రక ప్రముఖుల కథలు. ఆ కథల నుండీ ఏమి నేర్చుకొన్నదీ చర్చించడం, మధ్యమధ్య హాస్యం, చమత్కారాలతో నిండి, చక్కని సందేశాలనిచ్చే చిన్న చిన్న కథలు కూడా

చోటు చేసుకున్నాయి. రామాయణ మహా భారతాలలోని స్ఫూర్తిదాయక మైన కథలూ వచ్చాయి వరుసలోకి. పలనాటి వీరచరిత్ర వంటి తెలుగు వీరుల చరిత్రలూ నేర్పించారు. ఇవన్నీ అయాక ఆలోచననూ, ఏకాగ్రతనూ, వినికిడిలో, చూపులో చురుకుదనం పెంచే చిన్న చిన్న ఆటలు కూడా ఆడించారు. మొత్తం మీద చిన్నపిల్లలు చిలకమ్మలు, కాకమ్మల కథల ద్వారా, శివాజీ బాల్యం వంటి విషయాల ద్వారా స్ఫూర్తి పొందితే-పెద్ద పిల్లలు ఆలోచనాత్మకంగా సేవాదృక్పథం వైపు నడిపే "ఆనంద ప్రభు" వంటి కథలకు చక్కని స్పందన కనబరిచారు.

విడివిడిగా 22న చిన్నపిల్లలూ, 23న పెద్ద పిల్లలూ కూడా తాము నేర్చిన విద్యలను తల్లిదండ్రుల సమావేశాలలో ప్రదర్శించి చూపించారు. పవన ముక్తాసనం మొదలు సూర్య నమస్కారాల వరకు మొత్తం 15 రకాల ఆసనాలను ముచ్చటగా చేసి చూపించారు. ఆడపిల్లలు కూడా చక్కగా నేర్చుకొని చూపించారు. (వీళ్లు పిరమిడ్స్ కూడా తొలిసారిగా నేర్చుకున్నారు.) మగ పిల్లలు ఐదారు రకాలైన పిరమిడ్స్‌ను పొందికగా విజయవంతంగా ప్రదర్శించారు. "సాయిధామ శిబిర బాలలం" అంటూ పెద్ద పిల్లలు, "చిన్ని కృష్ణుడమ్మా" అంటూ చిన్నవారు కోలాట ప్రదర్శనలివ్వగా ఇరు శాఖల వారూ నాట్యప్రదర్శనలు కూడా చేసారు. నేర్చిన వాటిలో ఒక్కొక్క కథ వినిపించారు. శ్లోకాలు చదివి, భావాలు వివరించారు. భజనలు (అందరూ కలిసి భజనలు చేస్తే అతడే రాకుంటాడా!) దేశభక్తి గేయాలు (నమో హిందు మాతా, ఈ దేశం మా దేశం, పాడరా ఓ తెలుగు వాడా వంటివి) వినిపించారు. ఓ చిన్ని చక్కని నాటిక కూడా ప్రదర్శించారు. మొత్తం మీద - పదకొండు రోజులలో ఇన్ని నేర్చుకొన్నారా! అని తల్లిదండ్రులు ఆశ్చర్యపోయేంత చక్కగా సాగింది ఆ ముగింపు సమావేశం. పరమపూజ్య గురుదేవులు విద్యకూ, శీలానికీ ఉన్న సంబంధాన్ని





వివరించి చెప్పగా- మాతాజీ పిల్లలలో దాగి ఉన్న కళలను పైకి తీయడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. అటుపైన పిల్లలందరూ తమతమ ప్రోగ్రెస్ కార్డులు తీసుకొని వెళ్లిపోవటంతో యీ సంవత్సరానికి 'స్కూల్ ఇయర్' ముగిసింది.

సాధారణంగా పిల్లలు స్వచ్ఛ మనస్కులనీ, కానీ యిప్పటి పిల్లలలో మానవతా విలువలు తగ్గిపోతున్నాయి. ఆర్ద్రత, స్పందన, విశ్వాసం కొరవడి పోతున్నాయని చాలాకాలంగా నాకు బాధ ఉన్నది. కొంత నిరాశ కూడా ఉంది. ఈ శిబిరంలో జరిగిన రెండు, మూడు సంఘటనలు నాలోని నిరాశను పోగొట్టటమేకాదు - పిల్లల ద్వారానే జాతి పునర్నిర్మాణం కాగలదు- పూర్వపు ఔన్నత్యాన్ని పొందగలదన్న విశ్వాసానికి మరింత ప్రోది చేసింది. 'ఆనంద ప్రభు' అనే కథ చెప్పేటప్పుడు ఎందరికో సేవ చేసిన చిలకమ్మ చచ్చిపోయిందని విన్నప్పుడూ, అల్లరి గోపీని మంచివాడుగా మార్చిన సీతాకోక చిలుకను కొంటెపిల్లలు రెక్కలు విరిచి చంపివేసా రన్నప్పుడు, ఖుదీరాంబోసును ఉరితీసే ఘట్టం విన్నపుడూ కనీసం సగం మంది కళ్లలో నిండిన నీళ్లు, మొత్తం అందరి విషాద వదనాలు-పిల్లల్లో యింకా స్పందన, సహజ కరుణ చచ్చిపోలేదని చెప్పాయి. చర్చలలో వాళ్ల భావ ప్రకటన కూడా దీన్నే ఋజువు చేసింది. అంతేకాక -

'మీరు పరీక్షల్లో పాసయ్యారు గదా! నాకు స్వీట్లివ్వరేం?' అన్నాను ఆశ్రమం పిల్లలతో. 'మీరే మాకివ్వాలి పాసైనందుకు' అంది చటుక్కున ఓ సిసింద్రీ. "మాకు డబ్బులెక్కడి నుంచీ వస్తాయి" అంది మరో చిచ్చుబుడ్డి. "అమ్మ దగ్గర తీసుకొని కొనివ్వండి" అన్నాడు రామన్న. "అమ్మ దగ్గరే కాదు- అన్న దగ్గరా ఉంటాయి డబ్బులు" అన్నాను. రామన్న జేబులోంచి తీసి యివ్వబోయాడు. వెంటనే సిసింద్రీ "వద్దు వద్దు" అంటూనే ఓ శ్లోకం అందుకున్నది. చిచ్చుబుడ్డి గొంతు కలిపింది.

**"ఉత్తమం స్వార్జితం విత్తమ్**

**మధ్యమం పిత్రార్జితమ్**

**అధమమ్ భ్రాతృ విత్తంచ**

**స్త్రీ ధనం అధమాధమమ్॥"** - వద్దులే అన్నా! మేము సంపాదించినప్పడే కొనిస్తాం" అన్నాయి రెండు గొంతులూ. మా శిబిర లక్ష్యాలు క్రమశిక్షణ, ఆలోచన, ఆచరణ. ఇద్దరు చిన్న పిల్లలు తాము విన్నదాన్ని వెంటనే సందర్భాన్ని బట్టి సమన్వయించగలిగారంటే - చాలు కొంతైనా మా శిబిర లక్ష్యం నెరవేరినట్లే - అని ఆనందించాను.

మరునాటి ఉదయం జరిగిన ఉపాధ్యాయ సమావేశంలో కొందరు టీచర్లు స్పందిస్తూ "ఇలాంటి శిక్షణ శిబిరాల వలన పిల్లలే కాదు - మావంటి వాళ్లం కూడా స్ఫూర్తి పొందుతాము. మేమందరం గ్రాడ్యుయేట్లమూ, పోస్టు గ్రాడ్యుయేట్లమే. కానీ, అనేక కొత్త విషయాలు యీ శిబిరంలో నేర్చుకోగలిగాము. చరిత్రలో మరుగునబడిపోయిన ఎందరో స్వాతంత్ర్య వీరుల పేర్లు ఇప్పడు తెలుసుకోగలిగాము. రవి దినం-ఆదిత్య వారం-ఆదివారం- సన్‌డే ప్రాధాన్యత యిప్పడే తెలుసుకున్నామనీ, ఆ రోజు స్త్రీ పొందు, తైలాభ్యంగనం, మధుపానం, మత్స్యమాంసాలు తినడం దోషభూయిష్ఠమూనని యిప్పడు తెలుసుకోగలిగాము. భీష్మాచార్యుల వారి ఆ సూక్తిని జీవితమంతా పాటిస్తాము" అని కంఠోక్తిగా చెప్పటం యీ శిక్షణ శిబిరానికి కలికి తురాయిగా అనిపించింది.

మే 9వ తేదీ ఉదయం ఏడున్నరకు సాయిధామం పిల్లలు, పెద్దలు, గురుదేవులతో కూడా రేపల్లెకు బయలుదేరి వెళ్లారు - శ్రీ సాయినాథ క్షేత్రంలో వార్షికోత్సవాల నిమిత్తం. అక్కడికి మాతాజీ (తీవ్ర అనారోగ్యంతో హాస్పిటల్లో ఉండి రావటం చేత) వెళ్లలేదు. ఆ కారణం చేత అక్కడి కార్యకలాపాల వివరాల నివేదిక ప్రత్యక్ష సాక్షులు అందిస్తారు.





# శ్రీ కోదండరామ సాయి సన్నిధానంలో ...

- ప్రేమ్‌కుమార్

మే నెల 13వ తేదీ హనుమజ్జయంతి. ముందరిరోజు రాత్రి పరమ పూజ్య గురుదేవులు, పిల్లలు, రామన్న అందరూ రేపల్లె నుండి సాయిధామం వెడుతూ సత్తెనపల్లిలో ఆగారు. ఉదయాన్నే సాలంకృతులైన హనుమంతుని చూచి నమస్కరించి మాకు ఆశీస్సులందించి వెళ్లిపోయారు. ఉదయం 5 గం॥ 30 ని.లకు ఆంజనేయాలయంలో సహస్ర నామార్చన చేసాము. రావిచెట్టు క్రింద ఉన్న చిన్న ఆంజనేయునికి క్షీరాభిషేక, పంచామృతాభిషేకాలు చేసారు భక్తులంతా. తదుపరి శ్రీ హనుమత్స్వామికి సామూహికంగా ఆకుపూజ జరిగింది. వడమాల, నాగవల్లీ దళమాల, రకరకాల పూలమాలలు తెచ్చారు భక్తులు. పూజ చేసుకున్న వారందరికీ హనుమ రూపులతో తోరాలిచ్చాము. అప్పాలు, వడపప్ప, పానకం, వడలు ప్రసాదాలుగా పంచాము. చూడవచ్చిన భక్తులంతా తాము కూడా పూజలో కూర్చోలేకపోతిమే - అని బాధపడ్డారు.

ఇక సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభించి 108 ఆవర్తాలు హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. కొందరు భక్తులు పూజలు చేసుకున్నారు. శ్రీ సాయి దేవాలయంలో సాయం హారతి కాగానే-శ్రీ ఆంజనేయుల వారి చిన్న విగ్రహాన్ని శ్రీ నాగసాయీ బ్రిక్స్ యజమాని రాజేంద్రప్రసాద్‌గారు పంపిన ట్రాక్టర్ (ముందే అలంకరించి ఉంచాము) మీద ఉంచి, కొబ్బరికాయ కొట్టి, హారతిచ్చి, నామోచ్చారణతో ఊరేగింపు ప్రారంభించాము. శ్రీమతి శ్రీలక్ష్మి నీళ్లు వారబోసి సాగనంపారు. ఇక ఆ ఊరేగింపు రాత్రి పదకొండింటిదాకా సాగింది. దారి చూపటంలో, మైక్ లైటింగ్ సెట్ చేయటంలో శ్రీ జగదీశ్‌బాబు, శ్రీ మాణిక్యాలరావుగారు

ఎంతో సహకరించారు. ఊరేగింపు ఆద్యంతం ట్రాక్టర్ వెంట నడుస్తూ దారి చూపిన శ్రీ వీరాస్వామిగారు గణనీయమైన సేవ చేసారు. మైకు కోసం బేటరీ అందించారు శ్రీ మేడికొండూరు నాగరాజుగారు. ఇలా ఎందరెందరో అభిమానులు ప్రేమతో తోడురాగా సాగిన యీ శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకర్షించింది. ముఖ్యంగా యిది సాయి సన్నిధానం నుండీ రావటం ఆనందపరిచింది. ప్రతిచోటా నీళ్లు వారబోస్తూ, హారతులిస్తూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు అందరూ. రాత్రి పదకొండు అయినప్పటికీ భావనా ఋషి కాలనీ వాసులంతా కూడా పరుగు పరుగున ఇళ్లలోంచీ బయటికి వచ్చి సేవలో పాల్గొనటం ఆనందం కలిగించింది.

ఈ ఉత్సవానికింకా పోలంకి మల్లీశ్వర ప్రసాద్ దంపతులు, తాటికొండ శ్రీనివాసరావుగారు, శ్రీ అమరేంద్రగారు మొదలైన వారెంతో సహకరించారు. అందరికీ సాయి ఆశీస్సులు. ముఖ్యంగా మా ఊరేగింపు పొడవునా ప్రసాదాలు పంచుతూ, హనుమానునికి జయజయ ధ్వానాలు పలుకుతూ, ట్రాక్టర్‌కు అడ్డు వచ్చిన కొమ్మలు నరుకుతూ కోలాహలం చేసిన మా బాల వానరసేన నందు, ప్రవీణ్, సతీష్, చందు, గోపీ, తీర్థ, లక్ష్మీనారాయణలకు ఆ మహావానరుని మహదాశీర్వచనాలు లభించుగాక!

# సాయినాథ క్షేత్రంలో ఏం జరిగింది!

– పుట్టగుంట సాయిరమణ

సాయినాథ క్షేత్రంలోని 'సర్వతోభద్ర' సాయి దేవాలయంలో ప్రసన్న సాయి దేవులు కొలువై తొమ్మిదేళ్లు నిండుతున్న సందర్భంగా మే నెల తొమ్మిదవ తేదీ నుండీ హడావుడి ప్రారంభమైంది. పరమపూజ్య గురుదేవులు తమ పరివారలతో, సాయిధామ బాలలతోసహా ఆ రోజు





సాయంత్రానికి వేంచేయటంతో మా క్షేత్రానికి మరింత చైతన్యం వచ్చింది. 10వ తేదీ ఉదయం నుండీ ఎందరో ఆత్మీయ భక్తులు ఆశ్రమానికి వచ్చి గురుదేవుల దర్శనం చేసుకోవటం, స్వామీజీ వారి యోగక్షేమాలు తెలుసుకొని, ఆధ్యాత్మిక విషయాలు బోధించటం జరిగాయి. అటుపైన మా గీతక్క చేసిన వంటకాలు తిని చాలా రోజుల తరువాత సాయిధామ ప్రసాదం రుచి దొరికిందని మా నోళ్లు ఆనందించాయి.

ఇక సాయంత్రం నుండీ మరునాటి ఊరేగింపు కోసం ట్రాక్టర్‌ను అలంకరించే పని ప్రారంభమైంది. మా సాయిచంద్ర (చిట్టి) అన్నయ్య ఆధ్వర్యంలో బాల పటాలమంతా ఖడ్గధారులై కర్రలు నరికి తెచ్చి, జెండాలు కట్టటంతో ప్రారంభించి అలంకరణ చేయగా -ఆశ్రమాభిమానులు కన్నయ్య కుమారస్వామి గారలు వచ్చి కొబ్బరి మట్టలు అల్లి కట్టి దానికి మరింత శోభ చేకూర్చారు. 11వ తేదీ ఉదయం మా మనసుల నిండా ఉత్సాహం, కంగారూను. ఉదయం భక్తులంతా క్షీర, జలాభిషేకాలకు వచ్చేసారు. కార్యక్రమం గురుదేవులు ప్రారంభించారు. ఆ కాషాయాంబరధారి గురుదేవులు శ్వేతాంబరధారి సాయికి క్షీరాభిషేకం చేస్తుంటే ఎంత కన్నుల పండువో! ఇటు వీరి చిరునవ్వు-అటు వారి చిద్విలాసం! భక్తులు అవి చూస్తూ పునీతులయ్యారు. అనంతరం శ్రీ ఏకాంబరం గారు తెచ్చిన నూతన వస్త్రాలు ధరించారు సాయినాథుల వారు. తదుపరి ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ధ్వజ ప్రదక్షిణ తరువాత తొలి పూజ.

ఉదయం పదిగంటలైంది. ఆశ్రమం నుండీ శ్రీ సాయినాథుల వారి ఊరేగింపు ప్రారంభమైంది. శ్రీ రామకోటేశ్వరరరావుగారి పూనికతో తయారై వచ్చిన పంచలోహ విగ్రహం అరవపల్లి గ్రామంలో నుండీ ట్రాక్టర్ మీదికి వచ్చింది. అది విగ్రహం కాదు-స్వయంగా బాబాగారే మాపై కరుణ చిలుకుతూ వచ్చి మమ్మల్ని అనుగ్రహించారనిపించింది. ఇక ట్రాక్టర్‌పైన

ఎక్కిన మా పిల్లమూక సంబరం చూడాలి. మహోత్సాహంతో నామ సంకీర్తనం చేస్తూ త్రోవ పొడవునా వినేవారికి శ్రవణపుణ్యాన్ని కలిగించారు. అలా అలా నల్లూరు, మైనేనివారిపాలెం గ్రామాలలో సంచరించి రాత్రి పదింటికి సాయిదేవులు ఆశ్రమానికి వేంచేసారు. వారికి ధాన్యాభిషేకంతో ఆనాటి కార్యక్రమాలు ముగిసాయి. మేమంతా ఊరేగింపుకు వెడితే మా ఆడపడుచులందరూ ఆలయంలో ఉండి రామన్న ఆధ్వర్యంలో శ్రీ సాయి చరిత్ర పఠనం, సాయి చాలీసా, విష్ణు సహస్ర నామాల పారాయణలు, భజనలు చేస్తూ మూలవిరాట్టును, గుడికి వచ్చిన భక్తులను ఆనందింపజేసారు.

12వ తేదీ కాకడ హారతి అయిన వెంటనే క్షీరాభిషేకం ప్రారంభమైంది. దానికన్నా ముందరే గురుదేవులు పట్టెడంత వెన్న సాయిదేవుల తనువంతా పూసారు. ఆ నవనీత చోరుడు ఎంత ఆనందించి ఉంటాడో! క్షీరాభిషేకం తరువాత నవవిధ భక్తి ధారల్లాటి తొమ్మిది రకాల ఫల రసాలతో, అటుపైన పంచామృతాలతో, చివరికి మా కృష్ణవేణమ్మ చల్లని నీటితో అభిషేకాలందుకున్నాడు సాయి. రామన్న బాబా వారికి చేసిన అలంకారం పరమ సుందరంగా అనిపించింది. అది చూచి తల్లులు ముచ్చటపడి మురిసిపోతే - యువభక్తులు సాయిని సెల్‌ఫోన్‌లలో బంధించే ప్రయత్నాల్లో పడ్డారు.

ఉదయం పది గంటలకు శ్రీ సాయినాథ వ్రతం ప్రారంభమైంది. బాల బృందం, ఏలియా, కన్నయ్య మొదలైనవారు అందరికీ పూజాద్రవ్యాలు అందించారు. రామన్న విధిపూర్వకంగా వ్రతం చేయించి, కథలన్నీ వినిపించాడు. తెనాలి భక్తులు శ్రీ సత్యనారాయణగారు సాయిని గజమాలతో అలంకరించారు. గురుదేవులను కూడా పుష్పమాలతో అలంకరించి ఆశీస్సులు అందుకున్నారు. తదుపరి గురుదేవుల ఆశీః ప్రవచనం, బాబా లీలలు, భక్తులు ఉండవలసిన రీతులు రమ్యంగా వివరిస్తూ సాగింది.





అటుపైన గురుదేవులకు నమస్సులర్పించి ఆశీస్సులు తీసుకున్నారు భక్తులందరూ. భక్తజనులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు పన్నెండు వందల మంది హాజరైన యీ ఉత్సవానికి చేయూతనిచ్చిన సహృదయులందరికీ శ్రీ సాయి ఆశీస్సులు లభించుగాక! ఈ విధంగా మా ప్రసన్నసాయి వార్షికోత్సవాల ఆనందప్రదంగా ముగిసాయి. ఆ కరుణా సముద్రుడు, సర్వవ్యాపీ, సర్వజ్ఞుడూ అయిన శ్రీ సాయి అనుగ్రహం మనందరిపై నిరంతరం వర్షిస్తూ ఉండుగాక!

## స్వరాంజలి

**- రామకృష్ణ కథామృతం నుండీ**

చాలునే నీ నిద్ర మనసా
ఇంకెంతకాలము నిదురపోయెదవె?
మాయ కౌగిటలోన మమతలో చిక్కి
కనుమూసి ఎన్నాళ్లు కులుకుచుండెదవు ॥చా॥

ఏల పుట్టితి నీవు? ఎవరవే నీవు?
నీ రూపమసలేమొ మరచిపోయితివి
నీ కనులు విప్పవే యికనైన మనసా
పీడకల నుండి వడిమేలు కొనవే ॥చా॥

నీ యందె నిత్యమౌ ఆనందముండ
తరలిపోయెడి బయటి తళుకులకు భ్రమసి
బుద్ధి లేకను నీవె బద్ధమైనావు
వెడలి చీకటి నుండి వెలికి రారాదె ॥చా॥

తెలివి మాలినదాన, మలినమానసమ
వేగమే వెలుపలికి వెడలి రావమ్మ
ఉదయాద్రి పై నుండి ఉదయించు రవికి
చేయెత్తి వందనము చేయరావమ్మ ॥చా॥

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

08-02-1912

నేను నిద్రలేచి కాకడ హారతికి వెళ్ళి వచ్చి, దినచర్యలో పడిపోయాను. నారాయణ్‌రావ్, బామన్‌గావ్‌కర్ తిరిగి వెళ్ళేందుకు అనుమతి సంపాదించుకున్నారు. అందుచేత మా ఆవిడ కొన్ని వస్తువులు అతనికిచ్చి అమరావతి పంపించింది. ఆయన టాంగాలో వెళ్లాడు. ఆయన బయలుదేరకముందే సతారాలోని ముటాలిక్ నుండి కర్భారి కొడుకు గణపతిరావ్ వచ్చాడు. తిల సంక్రాంతి కోసం సాంప్రదాయకంగా తెచ్చే నువ్వులతో చేసిన బహుమతులు తెచ్చాడు. నువ్వులు, చక్కెర కలిపి చాలా కళాత్మకంగా తయారుచేశారవి. మూడు వారాల తరువాత మొదటిసారిగా మా బల్వంతు మసీదుకు వెళ్లి బాబా పాదాల మీద తలవాల్చాడు. వాడు చాలా మెరుగయ్యాడు. గణపతిరావు రంగపంచమికి సతారా రమ్మని బల్వంత్‌ని కోరాడు. నేను అతనికి సాయిబాబా గురించి చెప్పాను. మధ్యాహ్నహారతి మామూలుగా నడిచింది. చివ్వరిలో సాయిబాబా కోపం చూపించారు. ఆ సాయంత్రం మామూలు గానే దీక్షిత్ రామాయణం చదవటంతోనూ, నేను దాసబోధ చదువుకోవడం తోనూ గడిచింది. మా పంచదశి క్లాసు ప్రొద్దున్నే అయిపోయింది. సాయిబాబాను సాయంత్రం నడకలో చూచాము. మిస్టర్ కులకర్ణి అనే అతడు బొంబాయి నుండి వచ్చాడు. ఆయనకు అక్కడ ఒక ప్రయోగశాల ఉంది. అందులో ముడిఖనిజాలు మొదలైన వాటిని పరీక్ష





చేస్తారు. ఆయన నన్ను 1907లో సూరత్‌లో చూచానన్నారు. పాత కబుర్లు చెప్పు కుంటూ కూర్చున్నాము. రాత్రి భీష్మ భజన, దీక్షిత్ రామాయణం నడిచాయి.

09-02-1912

నేను మామూలుగానే లేచి ప్రార్థన చేసుకొని పంచదశి క్లాసుకు వెళ్లాను. అది జరుగుతుండగానే సాయి మహరాజ్ బయటకువెళ్లారు. క్లాసు పూర్తయ్యాక నేను మసీదుకు వెళ్లాను. సాయిబాబా మంచి మూడ్‌లో ఉన్నారు. కిష్య అనే కుర్రాడు ఎప్పటిలాగే అక్కడికి వచ్చాడు. అతణ్ణి మేము పిష్య అంటుం టాము. అతణ్ణి చూస్తూనే సాయిబాబా గత జన్మలో అతడు ఒక రోహిల్లా అనీ, చాలా మంచివాడనీ, చాలాకాలం ప్రార్థన చేసి సాయిసాహెబ్ తాతగారి దగ్గరకు అతిథిగా వచ్చాడనీ చెప్పాడు. ఆయనకో చెల్లెలు వరుసయిన అమ్మాయి ఉంది. ఆమె విడిగా జీవిస్తూ ఉండేది. అప్పుడు సాయిసాహెబ్ కూడా చిన్నపిల్లాడే. అతను ఆటకాయితనంగా ఆవిడను పెళ్లాడమని రోహిల్లాతో అన్నాడు. అది అలా జరగవలసి ఉంది. అతను నిజంగానే పెళ్లి చేసుకున్నాడు. చాలాకాలం ఆమెతో కలిసి జీవించాడు. తర్వాత ఎటో వెళ్లిపోయాడు. ఎవ్వరికీ కనబడలేదు. అతను మరణించాక సాయిసాహెబ్ అతణ్ణి యిప్పుడున్న తల్లి గర్భంలో ప్రవేశపెట్టాడు. పిష్యా చాలా అదృష్టవంతుడవుతాడనీ, వేలాదిమందికి రక్షకుడవుతాడనీ అన్నారు ఆయన. మధ్యాహ్న హారతి మామూలుగా గడిచిపోయింది. అప్పుడే సాయిసాహెబ్ శివానందశాస్త్రితో ఏదో చెప్పి సైగలు చేశారు. దురదృష్టవశాత్తు ఆయన అవి అర్థం చేసుకోలేకపోయారు. సాయిసాహెబ్ బాబాసాహెబ్ జోగ్‌కు కూడా సైగలు చేశారు. ఠాణాకు చెందిన ప్లీడరు మిస్టర్ ఓక్ యిక్కడ ఉన్నారు. బాబా గుప్తేకు, మిగిలిన మిత్రులకు నన్ను గుర్తు చేయమని ఆయన్ని అడిగాను.

(సశేషం)